సాక్షి
వరంగల్
శనివారం | 23 | సెప్టెంబర్ | 2023

న్యూస్‌రీల్

నేడు గ్రీవెన్స్ డే

కాశిబుగ్గ సెంటర్ : దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం శనివారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో దివ్యాంగులు, వయోవృద్ధులు తమ వినతులను అందజేయాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ శారద కోరారు.

ఎల్బీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



రామన్నపేట/కాశిబుగ్గ సెంటర్ : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో మ్యూజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, జెన్‌పాక్ట్ కంపెనీ, హెచ్‌ఆర్‌హెచ్ఎస్ కంపెనీలు శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ.డీహెచ్‌రావు తెలిపారు. నగరంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరై ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం, టెక్నికల్ స్కిల్స్ ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ కన్వీనర్ బి.శ్రుతి, సభ్యులు రాజేశ్వర్‌రావు, మమత, రాణి, అఫ్జల్, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మ్యూజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 25న ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7993041382, 8978677197 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గీసుకొండ : అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండె వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భస్థ, రొమ్ము క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించి వైద్యాధికారుల పర్యవేక్షణలో చికిత్స అందించాలని ఆయన సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అసంక్రమిత వ్యాధుల నిర్మూలనపై శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వైద్య సేవలను ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు తీసుకున్న ప్రతిఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పరిశీలకుడు డాక్టర్ శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అసంక్రమిత వ్యాధులపై అవగాహన కలిగించాలన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాల్‌రావు, కోఆర్డినేటర్ ప్రకాశ్‌రెడ్డి, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, డిప్యూటీ డెమోలు పాల్గొన్నారు.

రూ.51 చెల్లించండి.. డ్రాలో సైకిల్ గెలుపొందండి!



రాయపర్తి : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా రూ.51 చెల్లిస్తే డ్రా లో సైకిల్ గెలుచుకునే అవకాశాన్ని కల్పించారు నిర్వాహకులు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిర్మలాయపల్లిలో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండపం ఎదుట నిర్వాహకులు సైకిల్‌ను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. రూ.51 చెల్లిస్తే సైకిల్ గెలుచుకునే అవకాశం అని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రహదారి వెంట వెళ్లే వారు సైకిల్, ఫ్లెక్సీని ఆసక్తిగా తిలకిస్తున్నారు. నిమజ్జనం రోజున లక్కీ డ్రా తీయనున్నట్లు నిర్వాహకులు గజవెల్లి సందీప్, శోభన్, సతీష్, ప్రదీప్, ప్రశాంత్, సాయి, బాషబోయిన నరేష్, చంద్రశేఖర్, శివ, రక్షిత్, దొంతరబోయిన అనిల్, మామిడాల రంజిత్ తెలిపారు.

టేకు కలప పట్టివేత

చెన్నారావుపేట : పాపయ్యపేటలో టేకు కలపను పట్టుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుభాష్ తన ఇంట్లో అక్రమంగా టేకు కలప నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారంతో నర్సంపేట అటవీశాఖ అధికారులు తనిఖీలు చేసి రూ.26 వేల విలువ గల 8 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న దుంగలను నర్సంపేటలోని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఎస్ఓ సోము తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది యోగి, వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

మరోసారి ఈ-కేవైసీ

రేషన్‌కార్డుదారులకు తప్పనిసరి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈ నెల 11న ప్రారంభమైన ప్రక్రియ
- రేషన్ షాపుల్లో డీలర్ల నమోదు
- ఈనెలాఖరులో పూర్తికి సన్నాహాలు





నెక్కొండలో ఈ-కేవైసీ కోసం వేలిముద్ర వేస్తున్న మహిళ

జిల్లాలో రేషన్ షాపులు, లబ్ధిదారులు, కార్డుల వివరాలు

రేషన్ షాపులు	509
రేషన్‌కార్డులు	2,86,740
లబ్ధిదారులు	7,48,463
బియ్యం మెట్రిక్ టన్నులు	4,26,760

నెక్కొండ : ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి రేషన్ లబ్ధిదారులకు ఈ-కేవైసీ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. కార్డులు జారీ చేసి ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియ తమకు అదనపు భారంగా మారుతోందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. రేషన్ బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారుల్లో ఎవరో ఒకరు మాత్రమే షాపులకు వెళ్తారు. నెలనెలా ఫింగర్ ప్రింట్, ఐరిస్ ద్వారా బియ్యం తీసుకుంటారు. ప్రభుత్వం సుమారు పదేళ్ల క్రితం కార్డులు జారీ చేసింది. ఈక్రమంలో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం అందుతున్నాయా లేదా అనర్హులు, ఇంకెవరైనా డూప్లికేట్ కార్డులతో బియ్యం తీసుకుంటున్నారా వంటి వివరాలు తెలుసుకునేందుకే ఈ-కేవైసీని పౌరసరఫరాల శాఖ చేపట్టింది. జిల్లాలో మూడు ఎంఎల్ఎస్ పాయింట్స్ ఉన్నాయి. వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా 192, నర్సంపేట ద్వారా 182, వర్ధన్నపేట ద్వారా 135 చౌకధరల దుకాణాలకు 4,26,760 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు.

ఆకుపచ్చ రంగులో నమోదు చేసుకున్న వారి పేర్లు..

జిల్లాలో కార్డుదారులకు ఈ-కేవైసీ నమోదు ఈనెల 11న ప్రారంభమైంది. తహసీల్దార్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ డీలర్లు పూర్తిచేయాల్సి ఉంటుంది. డీలర్ల వద్ద ఉన్న పీఓఎస్ పరికరాల ద్వారా కార్డుదారుల ఈ-కేవైసీ సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారు. ఈ పరికరంలో కార్డు నంబర్ నమోదు చేయగానే కుటుంబ సభ్యుల పేర్లు కనిపిస్తాయి. ఈ-కేవైసీ నమోదు చేయని వారి వివరాలు ఎరుపు రంగులో దర్శనమిస్తాయి. అలాంటి వారు ఐరిస్ లేదా ఫింగర్ ప్రింట్ ఆప్షన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈ-కేవైసీ నమోదు చేసిన వారి పేర్లు ఆకుపచ్చ రంగులో కనిపిస్తాయి. రేషన్ షాపులకు వచ్చే కార్డుదారులకు ఓ పక్క బియ్యం పంపిణీ.. మరో పక్క ఈ-కేవైసీ నమోదు చేయడం ఎలా సాధ్యమని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు పీఓఎస్ పరికరం సరైన సమయంలో పని చేయకపోవడంతో గంటల తరబడి వేచి చూడడం తలనొప్పిగా మారుతోందని వారు వాపోతున్నారు. తమపై పనిభారం మోపకుండా చూడాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

దుర్వినియోగం తగ్గించేందుకే..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత రేషన్‌కార్డుల పునరుద్ధరణ ప్రక్రియ చేపట్టలేదు. పలువురు లబ్ధిదారులు మరణించడం, ఆడ పిల్లల పెళ్లిళ్లు జరగడం, మగ పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని కుటుంబాల నుంచి విడిపోయిన సంఘటనలు ఉంటున్నాయి. ఈ ప్రకారం కుటుంబ సభ్యుల్లో కొందరు లేకున్నా నెలనెలా బియ్యం మాత్రం అందరికీ పంపిణీ చేస్తున్నారు. దీంతో దుర్వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది.

ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురావాలి..



ఈ-కేవైసీ నమోదు కోసం వచ్చే లబ్ధిదారులు తమ వెంట ఆధార్, రేషన్‌కార్డులు తీసుకురావాలి. రేషన్‌కార్డులు సుమారు పదేళ్ల క్రితం మంజూరు చేశారు. అప్పుడు ఐదేళ్లలోపు ఉన్న పిల్లల పేర్లు కార్డుల్లో నమోదై ఉంటే వారు ఈ-కేవైసీ కోసం వస్తే ఫింగర్ ప్రింట్ పడకపోవచ్చు. వీరితోపాటు వృద్ధులు, కూలీలు, కార్మికుల ఫింగర్ ప్రింట్స్ పడడం లేదు. వీరందరూ సమీపంలోని గుర్తింపు పొందిన ఆధార్ కేంద్రానికి వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించాలి. లేకుంటే రేషన్‌కార్డు ఈ-కేవైసీ పూర్తి చేయలేరు.

– గోరంట్ల వెంకట్‌నారాయణ, రేషన్ డీలర్ల సంఘం, నెక్కొండ మండల అధ్యక్షుడు

డీలర్లు అవగాహన కల్పించాలి..



రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ పునరుద్ధరణకు సహకరించాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డుల్లో పేరున్న ప్రతిఒక్కరూ తమ ఈ-కేవైసీని డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలి. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఈ-కేవైసీ చేసుకుంటేనే బియ్యం వస్తాయి..లేదంటే ఇవ్వరు అనేది మాత్రం అవాస్తవం. షాపులకు వచ్చిన వారికి డీలర్లు అవగాహన కల్పించాలి.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

వర్ధన్నపేట కాంగ్రెస్‌లో పోటాపోటీ

- బరిలోకి దిగేందుకు 18 మంది అభ్యర్థుల దరఖాస్తులు
- అధిష్టానం పరిశీలనలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఐపీఎస్ కేఆర్ నాగరాజు, నమిండ్ల శ్రీనివాస్ పేర్లు
- ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు.. ఆశావహుల ప్రయత్నాలు





సిరిసిల్ల రాజయ్య | కేఆర్ నాగరాజు | నమిండ్ల శ్రీనివాస్

సాక్షి, వరంగల్ : వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. దీంతో టికెట్ ఎవరికి వస్తుందోనన్న ఆందోళన అభ్యర్థుల కంటే కార్యకర్తల్లోనే ఎక్కువగా ఉంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్న హస్తం పార్టీ ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లతో సర్వేలు చేసి ఇప్పటికే తుది జాబితాను రూపొందించింది. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కేఆర్ నాగరాజుతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్‌లలో ఎవరినో ఒకరిని టికెట్ వరించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ముగ్గురి పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే జాబితాను రూపొందించిన స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేసే పనిలో నిమగ్నమైంది. ఢిల్లీలో ఆశావహులు కూడా ముఖ్య నేతలను సమన్వయం చేసుకుంటున్నారు. ఎందుకంటే ఇక్కడి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న అరూరి రమేష్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతోపాటు ఆ పార్టీలోని అసంతృప్తులు తమతో కలిసి వస్తారని ఆశావహులు లెక్కలు వేసుకుంటున్నారు.

తొందరగా ఫైనల్ చేస్తేనే..

వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 18 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎంపీ సిరిసిల రాజయ్య, కేఆర్ నాగరాజు, నమిండ్ల శ్రీనివాస్, బక్క జడ్సన్, డాక్టర్ పసుల యాకస్వామి, గన్ను మల్లయ్య, నరుకుడు వెంకటయ్య, పెరుమాండ రామకృష్ణ, పందుల రవి, హెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ కొట్టి భాస్కర్, చుంచు రవీందర్, బండెల రాజ భద్రయ్య, డాక్టర్ పులి అనిల్‌కుమార్, నంది శరత్‌లఖాన్, ఎం.పాల్‌ఆనంద్ కుమార్, జీఎస్ పరంజ్యోతి, జట్టి జై స్వామి ఉన్నారు. వీరిలో అభ్యర్థిని ఖరారు చేయడం ద్వారా జనాల్లోకి మరింత విస్తృతంగా వెళ్లే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఓ వైపు బక్క జడ్సన్.. ఎమ్మెల్యే అరూరి రమేష్ అక్రమాలపై గళమెత్తుతుంటే.. మరోవైపు కేఆర్ నాగరాజు ప్రజా సమస్యలున్న ప్రాంతాలకు వెళ్లి కార్యకర్తలను కలుపుకొని పోతున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కూడా అవకాశమిస్తే ఇక్కడి నుంచి పోటీ చేసి గెలుస్తానన్న ధీమాతో ఉన్నారు. అలాగే, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ కూడా పర్యటిస్తూ ప్రజల మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఢీకొనాలంటే బలమైన వ్యక్తినే దింపే దిశగా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తే ఈ నియోజకవర్గం కూడా కాంగ్రెస్ ఖాతాలోకి రావడం ఖాయమని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నర్సంపేటకు రూ.17 కోట్లు మంజూరు



ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.17 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. జీఓ 384 ద్వారా తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, కాంపౌండ్ వాల్స్, దేవాలయాల మరమ్మతులు, బీటీ, సీసీ, గ్రావెల్ రోడ్లు, సోలార్ లైటింగ్‌కు నిధులు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. అధికారులు వెంటనే అభివృద్ధి పనులను గుర్తించాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచించారు.

ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బంధనపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. మైలారం, బంధనపల్లి గ్రామాలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం మంత్రిని కలిశారు. పలు అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంజూరు చేశారు. జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు లేతాకుల సుమతి, దీప్లానాయక్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి వెంకన్న, గబ్బెట బాబు, పరుపాటి రవీందర్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, వెంకన్న, మాధవరెడ్డి, యాకయ్య, రాములు అశ్రఫ్‌పాషా, ఎల్కపల్లి రమేష్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు సన్నద్ధం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. శుక్రవారం కేయూలోని సెనేట్ హాల్‌లో కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీపీ మాట్లాడారు. ఎన్నికల తేదీలు ప్రకటించాక ఎన్నికల ముందు, తర్వాత రోజు నిర్వర్తించాల్సిన విధులు, నియమ, నిబంధనలు, సమాచార సేకరణ, మద్యం, డబ్బుల పంపిణీపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బులు, మద్యం, బహుమతులను పంపిణీ చేసే సమయంలో దొరికితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలనే అంశాలపై చర్చించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చెక్ పోస్టుల ఏర్పాటు, డబ్బు, మద్యం పంపిణీ మార్గాలు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలు, గంజాయి, గుడుంబా, పటిక నియంత్రణ, రౌడీషీటర్ల బైండోవర్లపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీసీపీలు దాసరి మురళీధర్, రవీందర్, అబ్దుల్ బారి, సీతారాం, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్

వర్ధన్నపేట : అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. కట్ర్యాల గ్రామ సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి అరూరి రమేష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. దీంతో పార్టీ బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారికి ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీలను నమ్మొద్దని ఆయన కోరారు.

పారదర్శకంగా పనులు చేయించాలి



ఓపెన్ ఫోరంలో పాల్గొన్న డీఆర్‌డీఓ సంపత్‌రావు

సంగెం : పారదర్శకంగా ఉపాధి హామీ పనులు చేయించాలని డీఆర్‌డీఓ మట్టపల్లి సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. 1 జనవరి 2021 నుంచి 31 మార్చి 23 వరకు 33 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన ఈజీఎస్ పనుల నివేదికలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ వసుమతి, క్వాలిటీ అధికారి రమణి, ఏపీఓలు మాధవి, భిక్షపతి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఆర్‌పీ సుధాకర్, ఏపీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం గృహలక్ష్మి పథకం

- దళిత, బీసీ బంధు లబ్ధిదారులకు కూడా వర్తింపు
- మరోమారు గెలిపిస్తే రూ.5 లక్షలు
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

గీసుకొండ : పేదలకు గృహలక్ష్మి పథకం వరమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే రూ.3 లక్షల నిధులు సరిపోవని కొందరు చెబుతున్నారని, తాను ఇంజనీర్లతో అంచనా వేయిస్తే సరిపోతాయని చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. మరియపురం శివారులోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో మండలంలోని 432 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ మండలానికి మరో 200 ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దళిత, బీసీ బంధుతోపాటు గతంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు లేకుంటే వారికి కూడా గృహలక్ష్మి కింద మంజూరు చేయిస్తానన్నారు. ఇళ్లు నిర్మించుకోలేక పాత గోడలు, బెడ్స్, పిల్లర్లు పోసుకుని వదిలేసిన వారికి కూడా సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రెండో దశలో ఇప్పిస్తానని పేర్కొన్నారు. మరోమారు బీఆర్ఎస్‌ను గెలిపిస్తే గృహలక్ష్మి కింద రూ.5 లక్షలు ఇప్పిస్తామని ఎంపీపీ భీమగాని సౌజన్య కోరిన మేరకు ఎమ్మెల్యే చల్లా స్పందించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జిల్లాలో 45 వేల దరఖాస్తులు రాగా పరకాల నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అనంతరం 24 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యేతో కలిసి పంపిణీ చేశారు. గృహలక్ష్మి లబ్ధిదారులతో స్వచ్ఛతాహీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్డీఓ సంపత్‌రావు, ఎంపీపీ భీమగాని సౌజన్య, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఎంపీడీఓ వీరేశం, ఎంపీటీసీ వీరారావు, సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, నాగేశ్వర్‌రావు, జయపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వంచనగిరిలో డెంగీ సర్వే



వంచనగిరిలో డెంగీ జ్వర పీడితులకు సూచనలు చేస్తున్న ఏడీ నాగయ్య

గీసుకొండ : మండలంలోని వంచనగిరిలో డెంగీ, మలేరియా కేసులపై శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన అడిషనల్ డైరెక్టర్ నాగయ్య సర్వే చేశారు. గ్రామంలో సుమారు 9 డెంగీ కేసులు ఉన్నట్లు గుర్తించారు. జ్వరపీడితుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా పారబోయాలని సూచించారు. దోమ లార్వాలు, దోమలను సేకరించి పరిశీలన కోసం తీసుకుని వెళ్లారు. సర్పంచ్ పారిశుద్ధ్య పనులను సరిగా చేపట్టాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకట్రావు యాదవ్, ఎంపీహెచ్‌ఓ సోమేశ్వర్, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్, హెచ్ఏ లచ్చన్న, మాధవి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్యాలయం ముట్టడి

పర్వతగిరి : హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయాన్ని కాంట్రాక్టర్లు శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా పర్వతగిరికి చెందిన కాంట్రాక్టర్ వంగాల రవీందర్ మాట్లాడుతూ బిల్లులు రాక కాంట్రాక్టర్లు రెండు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 40 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించకుంటే గ్రామాల్లోని ట్యాంకుల వద్ద నీటి సరఫరా నిలిపివేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

కాశిబుగ్గ : రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఆదర్శ రైతులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వివిధ కంపెనీల ఎరువుల సరఫరా, ఎఫ్ఓఎల్‌పై అందిస్తున్న ఎరువులు, ఎరువుల లభ్యత గురించి చర్చించారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. అధికారులు, డీలర్లు రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. డీలర్లు ఎఫ్ఓఎల్‌పై మాత్రమే ఎమ్మార్పీకి మించకుండా ఎరువులు విక్రయించాలని పేర్కొన్నారు. పురుగు మందుల పేరుతో బయో మందులను అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్య అతిథి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే రైతు బంధు, రైతుబీమా లాంటి పథకాలు అమలు చేస్తోందని వివరించారు. రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. డీలర్లు, తయారీదారులు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు రైతులకు అందించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ఈపాస్ మిషన్ల ద్వారానే డీలర్లు ఎరువులను అమ్మాలని, ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలు క్లియర్ చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ కార్యదర్శి శారదాదేవి, వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యవసాయ అధికారులు ఉషాదయాళ్, రవీందర్‌సింగ్, వ్యవసాయ శాఖ సంచాలకులు దామోదర్‌రెడ్డి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏఓ విజ్ఞాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ



మాట్లాడుతున్న ఆంగోతు అరుణ

వర్ధన్నపేట: ప్రభుత్వం అందించే వైద్య సేవలను పేద ప్రజలు వినియోగించుకోవాలని వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ అన్నారు. ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళాను శుక్రవారం వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆమె ప్రారంభించి మాట్లాడారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పలు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 13 నుంచి అక్టోబర్ 22 వరకు వైద్య సేవలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల పరిశుభ్రత చేపట్టేలా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ కడియం కావ్య, డాక్టర్ మానసారెడ్డి, ఎంజీఎం ఆస్పత్రి వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యాన కళాశాలలో సీట్ల భర్తీకి చర్యలు

● రెండో కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం మల్యాలలోని ఉద్యాన పరిశోధన స్థానానికి అనుబంధంగా ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన ఉద్యాన కళాశాలలో ప్రవేశానికి రెండో కౌన్సెలింగ్‌లో సీట్లు భర్తీ చేయనున్నారు. ఇందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కళాశాల మంజూరు జీఓ విడుదలైనప్పటికీ పూర్తిస్థాయిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చడంలో జాప్యం జరిగింది. ఈకారణంగా మొదటి కౌన్సెలింగ్‌లో సీట్లు భర్తీ చేయలేదు. దీంతో ఉద్యాన కళాశాలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ ఏడాది మల్యాలలో సీట్లు భర్తీ కావేమోనని ఆందోళనకు గురయ్యారు. స్పందించిన మంత్రి సత్యవతిరాథోడ్ సంబంధిత అధికారులు, కలెక్టర్ శశాంక, డీహెచ్‌ఎస్‌ఓ సూర్యనారాయణ తదితరులతో సమీక్షించినట్లు తెలిసింది. సీట్ల భర్తీ అనంతరం మౌలిక సదుపాయాలు, భవనం, అధ్యాపకుల నియామకం అంశాలపై చర్చించినట్లు సమాచారం. కాగా.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవన సమీపంలో ఉన్న జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ, ఇతర శాఖలు కొనసాగిన భవన సముదాయంలో మల్యాల ఉద్యాన కళాశాల తరగతులు కొనసాగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు అపరాధ రుసుముతో ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు హనుమకొండ డీఈఓ, ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు శుక్రవారం తెలిపారు. దూరవిద్యా విధానంలో టెన్త్, ఇంటర్ చదవాలన్న ఆసక్తిగల అభ్యర్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలైన ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సంప్రదించాలన్నారు. దళారులను నమ్మొద్దని, ఫీజులు మీసేవ, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. వివరాలకు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం పోలీసులు సుమారు 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో తరలించేందుకు గంజాయి సిద్ధంగా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్న పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈవిషయమై ఎస్‌ఐని వివరణ కోరగా.. గంజాయి పట్టుకున్నది వాస్తవమేనని, ఎంత పట్టుకున్నది, నిందితుల వివరాలు ఉన్నతాధికారుల విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

శిథిలాల కింద శవాలై..

● గోడ కూలడంతో ఇద్దరు మృతి
● అంబులెన్స్ ఆలస్యమై మరొకరు..
● స్థానికులు స్పందించడంతో నలుగురికి తప్పిన ప్రాణాపాయం
● శాయంపేటలో విషాదఛాయలు


ఘటనాస్థలిలో సాంబయ్య, సారలక్ష్మి మృతదేహాలు


గోడ కూలిన ప్రదేశం

శాయంపేట: ఇటీవలి వర్షాలకు గోడ కూలడంతో హనుమకొండ జిల్లా శాయంపేట మండలకేంద్రంలో ఇద్దరు మృతి చెందారు. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో మరొకరు ప్రాణాలు విడిచారు. మండల కేంద్రానికి చెందిన ముష్కె భాగ్యలక్ష్మి భర్త సురేశ్ కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆమె ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు మొత్తం కూలిపోయింది. దాని పక్కనే చిన్న రేకుల షెడ్డు వేసుకుని ఆమె కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తోంది. రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి గోడలన్నీ నానిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఒక్కసారిగా గోడ కూలింది. ఆస్పత్రికి వెళ్లొస్తున్న స్థానికురాలు పొట్టకారి సుభద్ర గమనించి కొంతమందిని లాగి దూరంగా నెట్టేసింది. ఈఘటనలో మోర సాంబయ్య(65), లోకలబోయిన సారలక్ష్మి(55)పై గోడ కూలింది. వారిని రక్షించేందుకు స్థానికులు చింతల రవిపాల్, మోరే మల్లక్క, గాజె మల్లేశం, అతడి కుమారుడు సదానందం ప్రయత్నించారు. కానీ.. అప్పటికే సాంబయ్య, సారలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై దేవేందర్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేశారు. తహసీల్దార్ సుభాషిణి, ఆర్‌ఐ శరత్‌కుమార్ ఘటన వివరాలు సేకరించారు.

అంబులెన్స్ ఆలస్యంతో జోగమ్మ మృతి

దామెర మండలం కోగిలవాయి నుంచి వినయ్ తన అమ్మమ్మ అయిన బోగి జోగమ్మ (గోడ కూలిన ఇంటి పక్క గృహస్తురాలు)ను తీసుకెళ్లేందుకు శుక్రవారం ఆటోలో శాయంపేటకు వచ్చాడు. ఈక్రమంలో ఆమె సన్నబియ్యాన్ని సంచిలో నింపి ఆటోలో వేస్తుండగా.. గోడ కూలి జోగమ్మపై మట్టిపెల్లలు పడి నడుము, కాళ్లు విరిగాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆలస్యం అవుతోందని మళ్లీ మళ్లీ ఫోన్ చేశారు. ఒకసారి పరకాల, మరోసారి ఆత్మకూరు, ఇంకోసారి దామెర నుంచి అంబులెన్స్ వస్తుందని అవతలి నుంచి సమాధానం వచ్చింది. అంబులెన్స్ ఆలస్యం అవుతుండడంతో జోగమ్మను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఆటోలో ఎక్కించారు. సమాచారం ఇచ్చిన గంట 15 నిమిషాల తర్వాత అంబులెన్స్ వచ్చింది. సీపీఆర్ చేసి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో ఆమె మృతి చెందింది.


రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

పండుగకు వచ్చి కానరాని లోకాలకు..

శాయంపేటకు చెందిన మోరె సాంబయ్య స్థానికంగా పని దొరక్క సిరిసిల్లలో నేత పని చేస్తూ బతుకు బండిని లాగుతున్నాడు. వినాయక చవితికి శాయంపేటకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం బీడీలు కొనుక్కునేందుకు వెళ్తుండగా.. రోడ్డు పక్కనే ఉన్న ఇంటి గోడ కూలి సాంబయ్య మృతి చెందాడు. సాంబయ్య మృతితో కుటుంబం రోడ్డున పడింది.

పని కోసం ఆరా తీసేందుకు వెళ్తూ..

మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన లోకలబోయిన సారలక్ష్మి భర్త 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె శాయంపేటలోని గోడ కూలిన పక్క ఇంట్లో అద్దెకు ఉంటూ కూలీ పనికి వెళ్తోంది. శుక్రవారం పని ఉంటే చెప్పమని కాలనీవాసులకు చెప్పి వస్తుండగా.. గోడ కూలడంతో ఆమె మృతి చెందింది.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

పరకాల ప్రభుత్వాస్పత్రిలో సాంబయ్య, సారలక్ష్మి, జోగమ్మ మృతదేహాల వద్ద వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల నగదు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నలుగురిని కాపాడిన..



నాకు జ్వరం వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తిరిగొస్తుండగా.. పోచమ్మ వీధికి వెళ్లే సీసీ రోడ్డు పక్కనే ఉన్న ఇల్లు గోడ కూలడాన్ని గమనించిన. అక్కడే ఉన్న కొందరిని, పిల్లలను లాగిన.. దూరంగా నెట్టేసిన. దీంతో నలుగురిని ప్రాణాపాయం నుంచి తప్పించిన.

– పొట్టకారి సుభద్ర, స్థానికురాలు

సమయానికి అంబులెన్స్ వస్తే జోగమ్మ బతికేది



ప్రమాదం జరిగిన వెంటనే 108కు ఫోన్ చేశాం. అంబులెన్స్ ఒకసారి పరకాల నుంచి వస్తుందని, మరోసారి ఫోన్ చేస్తే.. దామెర నుంచి వస్తుందని, ఇంకోసారి ఆత్మకూరు నుంచి వస్తుందని సుమారు గంట 15 నిమిషాలు సమయం వృథా చేశారు. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో జోగమ్మ మృతి చెందింది. ఇప్పటికైనా శాయంపేట మండల కేంద్రంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలి.

– చింతల రవిపాల్

సుప్రీంకోర్టుకు చేరిన పంచాయితీ

మంగపేట: మంగపేట మండలం షెడ్యూల్, నాన్ షెడ్యూల్ కేసు వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. 1973 నుంచి నలుగుతున్న వివాదం రెండోసారి 2006లో పురుడు పోసుకుంది. దీంతో 2001 నుంచి మండలంలో ఎన్నికలు నిలిచిన విషయం తెలిసిందే. సమస్యకు ముగింపు పలుకుతూ.. మండల పరిధి 23 రెవెన్యూ గ్రామాలు ఐదో షెడ్యూల్ ఏరియా పరిధిలోకి వస్తాయని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ 2023 జూలై 5న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. గిరిజనేతరులు స్టే ఇవ్వాలని కోరుతూ.. ఇటీవల సుప్రీం కోర్టును ఆశ్రయించి అప్పీలు దాఖలు చేశారు. అప్పీల్ నంబర్ 20490 ఆఫ్ 2023పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అనిరుద్ బోస్, గౌరవ న్యాయమూర్తి బేల త్రివేది ఎదుట శుక్రవారం వాదనలు జరిగాయి. ఆదివాసీ గిరిజనుల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, మృగాంక్ ప్రభాకర్ వాదనలు వినిపించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాల్లో షెడ్యూల్డు(ఏజెన్సీ) పరిధిలోకే వస్తాయని అనేకమార్లు జరిగిన విచారణ తర్వాత వెలువడిన తీర్పులు కూడా దీన్నే ధ్రువీకరించాయని గుర్తు చేశారు. స్టే ఇవ్వాలని గిరిజనేతరుల న్యాయవాది కోరగా.. స్టే ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇప్పటికే హైకోర్టులో గిరిజనులకు అనుకూలంగా స్టే ఇచ్చినందున ఎట్టి పరిస్థితుల్లో స్టే ఇవ్వకూడదని గిరిజనుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫు వాదనలు పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తగిన వివరాలను కౌంటరు అఫిడవిట్‌లో పొందుపర్చాలని గిరిజనుల తరఫు న్యాయవాది ప్రభాకర్‌కు సూచిస్తూ కేసు విచారణను అక్టోబర్ 10 వరకు కోర్టు వాయిదా వేసింది. ఎన్నికలకు ముందు మళ్లీ మంగపేట మండల గిరిజన, గిరిజనేతరుల మధ్య నెలకొన్న ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ పంచాయతీ సుప్రీంకోర్టుకు చేరుకోవడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఎక్కడ చూసినా గిరిజన, గిరినేతర ప్రజలు ఇదే విషయాన్ని చర్చించుకుంటున్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థులకు గైడ్‌ల కేటాయింపు

కేయూ క్యాంపస్: కేయూలోని సైన్స్ విభాగంలో శుక్రవారం బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ విభాగాల్లో సైన్స్ డీన్ ఆచార్య పి.మల్లారెడ్డి డిపార్ట్‌మెంటల్ రీసెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించి పీహెచ్‌డీ అభ్యర్థులకు గైడ్‌లను కేటాయించారు. ఇప్పటికే జువాలజీ, ఫిజిక్స్, జియాలజీ విభాగాల్లో గైడ్‌లను కేటాయించినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 21న కేయూ ఫార్మసీ కళాశాలలో డీన్ ఆచార్య వై.నర్సింహారెడ్డి గైడ్‌లను కేటాయించారు. పీహెచ్‌డీ సీట్లు పొందిన అభ్యర్థులు ఇప్పటికే జాయినింగ్ రిపోర్ట్‌ను ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందించారు. వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ అభ్యర్థులకు గైడ్‌ల కేటాయింపులను డీన్‌లు చేపడుతున్నారు.

అదరగొట్టనున్న మానుకోట బిడ్డ

● 19వ ఆసియా గేమ్స్‌లో ఆడనున్న సిక్కిరెడ్డి


బ్యాడ్మింటన్ ఆడుతున్న సిక్కిరెడ్డి (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: చైనాలోని హాంగ్జౌ వేదికగా శనివారం నుంచి ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్నాయి. బ్యాడ్మింటన్ విభాగంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి సిక్కిరెడ్డి ప్రతిభ కనబర్చనున్నారు. పతకం సాధించి తెలంగాణకు పేరు తేవాలని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, జిల్లాకు చెందిన ప్రముఖులు కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన నెలకుర్తి కృష్ణారెడ్డి, మాధవి దంపతుల కుమార్తె సిక్కిరెడ్డి. బాల్యంలో ఇక్కడే ఆటలో ఓనమాలు దిద్దారు. తండ్రి ఉద్యోగరీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లో పని చేయడంతో అక్కడ బ్యాడ్మింటన్‌లో పూర్తి మెలకువలు నేర్చుకున్నారు. ఎడమ చేతివాటంతో చిన్నతనం నుంచి ప్రతిభ కనబర్చిన సిక్కిరెడ్డి 2014 మే నెలలో ఢిల్లీ ఉబర్ కప్‌లో కాంస్యం, 2015లో నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకం, కామన్‌వెల్త్‌లో కాంస్యం.. ఇలా అనేక పతకాలు కైవసం చేసుకున్నారు.

అరుదైన అవకాశం..

ఆసియా గేమ్స్‌లో 40 దేశాలకు పైగా.. 41 క్రీడాంశాల్లో 655 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇందులో తెలంగాణ నుంచి 16 మంది పాల్గొంటున్నారు. వీరిలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన సిక్కిరెడ్డి ఉండడం గర్వకారణం.

మనకు గర్వకారణం..



మానుకోట బిడ్డ ఆసియా గేమ్స్‌లో ఆడుతుందంటే మనకు గర్వకారణం. సిక్కిరెడ్డి ఎడమ చేతివాటంతో బ్యాడ్మింటన్ చాలా బాగా ఆడుతుంది. ఆసియా గేమ్స్‌లో కూడా మంచి ప్రతిభను కనబర్చి పతకాలు సాధిస్తుందనే నమ్మకం ఉంది.

– సమ్మెట ప్రేమ్‌కుమార్, పీడీ టీఎస్ లక్ష్మీపురం

పట్టుదలతో పతకం సాధిస్తుంది..



సిక్కిరెడ్డికి మొదటి నుంచి పట్టుదల ఎక్కువ. ఇప్పటికే అనేక టోర్నమెంట్స్, దేశ, విదేశాల్లో జరిగిన క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన అనుభవం ఉంది. తన సాధన, పట్టుదలకు అనుభవాన్ని జోడించి పతకం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అందరి దీవెనలు ఆమెకు అండగా ఉంటాయి.

– నెలకుర్తి కృష్ణారెడ్డి, సిక్కిరెడ్డి తండ్రి

నమ్మకం ఉంది..



మా ఊరి సిక్కిరెడ్డి ఆసియా గేమ్స్‌లో ఆడుతుందంటే నాకే కాదు ఊరు ఊరే సంబురపడుతోంది. అక్కడ మంచిగా ఆడి పతకం సాధించాలి. ఇప్పటికే మా జయపురం గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సిక్కిరెడ్డిని చూసి గర్వపడుతున్నాం. ఇప్పుడు కూడా పతకం సాధిస్తుందనే నమ్మకం ఉంది.

– నెలకుర్తి సత్తిరెడ్డి, జయపురం

బాగా ఆడాలి.. దేశానికి పేరు తేవాలి



ఆసియా గేమ్స్‌లో మానుకోట బిడ్డ ఆడుతుండడం గర్వకారణం. గతంలో మాదిరిగా పతకం గెలుచుకునే వస్తుందని నమ్ముతున్నాం. నిరంతరం సాధన చేసే సిక్కిరెడ్డి ఆసియా గేమ్స్‌లో బాగా ఆడాలి.. దేశానికి పేరు తేవాలి.

– సింధువర్మ, పీడీ మోడల్ స్కూల్ మహబూబాబాద్

కేసీఆర్ చొరవతో ప్రత్యేక క్రీడా పాలసీ


పోటీలు ప్రారంభిస్తున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

● ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్
● జేఎన్‌ఎస్ వేదికగా రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు
● మూడ్రోజులపాటు కొనసాగనున్న క్రీడలు


హన్మకొండ: ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ఆధునిక వసతులను కల్పించడమే లక్ష్యంగా.. సీఎం కేసీఆర్ తెలంగాణలో ప్రత్యేక క్రీడా పాలసీ అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. పాఠశాల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్–17 రెజ్లింగ్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం వెనుకాల ఉన్న రెజ్లింగ్ హాల్ జరుగుతున్న ఈపోటీలకు ముఖ్య అతిథిగా వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. చారిత్రక ఓరుగల్లు కళలకు, పోరాటాలతో పాటు ప్రతిభ కల్గిన క్రీడాకారులకు నిలయమన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత ఓరుగల్లు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, సకల సౌకర్యాలతో స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్‌జీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్ మాట్లాడుతూ.. ఈపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 400ల మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని విదిష జిల్లా కేంద్రంలో జరగనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బాలికల ఫ్రీస్టైల్ 36 కేజీల నుంచి 73 కేజీల విభాగంలో పోటీలు నిర్వహించగా, బాలురకు గ్రీకో రోమన్ 41 కేజీల నుంచి 110 కేజీల కేటగిరీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు దస్రూ నాయక్ తెలిపారు. కోచ్‌లకు, క్రీడాకారులకు ఉచిత భోజన, ఇతర సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ జి.అశోక్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చెన్నం మధు, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజనీకాంత్, ఏనుగుల రాంప్రసాద్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, రాజబోయిన భిక్షపతి, పీడీలు సదానందం, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఒకరి మృతి


రవీందర్ (ఫైల్)

నెక్కొండ: మండల కేంద్రంలోని వారాంతపు సంత జరిగే స్థలంలో ఉనబావిలో పడి సంగెం మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని కక్కెర్ల రవీందర్ (61) శుక్రవారం మృతి చెందాడు. రవీందర్ ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు కుటుంబీకులు సంగెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్లారుగూడలో ఆటో ఎక్కిన రవీందర్ మచ్చాపురంలో దిగిపోయాడు. అక్కడి నుంచి నెక్కొండకు చేరుకున్న రవీందర్ బావిలో శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారమందించడంతో మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. రవీందర్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై జానీ పాషా తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడు..


జామ్లా(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని మహబూబాబాద్ మండలం సోమ్లా తండాకు చెందిన బానోత్ జామ్లా (70) మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం జామ్లా.. తండాలో రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో చిన్నగూడూరు వైపునకు వెళ్తున్న మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి రజాలిపేటకు చెందిన కాంపెల్లి శ్యామ్ బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం మృతి చెందాడు. వృద్ధుడి కుమారుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపారు.

ఇద్దరు కొరియర్ల అరెస్ట్


కొరియర్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వాజేడు: ఇద్దరు మావోయిస్టు కొరియర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వాజేడు మండలంలో సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఆసమయంలో ఏటూరునాగారం వైపు నుంచి వచ్చిన ఆటోను పరిశీలించగా.. కలువల ఐలమ్మ (రడగంబాల బస్తీ, బెల్లంపల్లి, మంచిర్యాల), ఆలూరి దేవేందర్ (నాగారం గ్రామం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా) అనుమానాస్పద బ్యాగులతో కనిపించారు. వారిని కిందకు దింపి బ్యాగులు పరిశీలించగా.. పేలుడు పదార్థాలైన కార్డన్ వైర్, డిటోనేటర్లు, బ్యాటరీలు, మరికొన్ని వస్తువులు కనిపించాయి. ఇద్దరు సాక్ష్యుల నడుమ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వెంకటాపురం(కె) సీఐ బండారు కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు అగ్ర నాయకులకు ఐలమ్మ, దేవేందర్ కొంతకాలంగా కొరియర్లుగా పని చేస్తున్నారన్నారు. మావోయిస్టు అగ్రనాయకుల ఆదేశానుసారం ఆవిర్భావ వారోత్సవాల్లో కూంబింగ్‌కు వెళ్లే పోలీసు పార్టీలను చంపాలనే ఉద్దేశ్యంతో అమర్చే ప్రెషర్ బాంబు తయారీకి ఉపయోగించే పేలుడు పదార్థాలను తీసుకెళ్తుండగా గుర్తించామని సీఐ తెలిపారు. వీరిని కోర్టుకు పంపనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పాటించని రొటేషన్ పద్ధతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో మేథమెటిక్స్ విభాగాధిపతి నియామకం వివాదాస్పదమవుతోంది. ఇప్పటి వరకు ఆవిభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సోమయ్య పదవీకాలం ఈనెల 5తో ముగిసింది. ఆతర్వాత రొటేషన్ పద్ధతిన సీనియార్టీ ప్రకారం.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భారవిశర్మను నియమించాల్సి ఉంది. కానీ ఆయనను కాదని.. వీసీ రమేశ్ అప్రూవల్ మేరకు అదే విభాగానికి చెందిన డాక్టర్ తిరుమలాదేవిని విభాగాధిపతిగా కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు నియమించారు. తిరుమలదేవి ఇప్పటికే అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆమె విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టేందుకు నిరాకరించారు. దీంతో ఈనెల 21న ఆవిభాగం డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ను విభాగాధిపతిగా నియమిస్తూ.. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజ్‌కుమార్ కూడా వ్యక్తిగత కారణాలు చూపుతూ తాను ఆ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించబోనని రిజిస్ట్రార్‌కు అదేరోజు లేఖను అందించారు.

రొటేషన్ పాటించట్లేదు..

కాగా.. రొటేషన్ పద్ధతిలో నియామకం జరగలేదనే కారణంతో తిరుమలదేవి, రాజ్‌కుమార్ బాధ్యతల్ని నిరాకరించినట్లు వర్సిటీలో చర్చ జరుగుతోంది. అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి కూడా గణిత విభాగంలో రొటేషన్ పద్ధతి ప్రకారం డాక్టర్ భారవిశర్మను ఎందుకు నియమించలేదని రిజిస్ట్రార్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. కాగా.. రొటేషన్ పద్ధతిలో నియమించాల్సిన వివిధ పరిపాలనా పదవులపై యూనివర్సిటీ అధికారుల వైఖరి విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే బాటనీ విభాగంలో విభాగాధిపతిగా కాంట్రాక్టు లెక్చరర్‌ను యూనివర్సిటీ అధికారులు నియమించడంతో రెగ్యులర్ ప్రొఫెసర్‌లు ఇద్దరు ఉన్నప్పటికీ వారికి అవకాశం ఇవ్వకపోవడంపై వివాదాస్పదంగా మారింది. అందులో రెగ్యులర్ అధ్యాపకురాలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే..

హైడ్రోజన్ పెరాక్సైడ్ తాగిన విద్యార్థి

● గతంలో నెయిల్ పాలిష్ తాగి అస్వస్థత
● కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నిర్లక్ష్యం

శాయంపేట: మండలంలోని పెద్దకోడెపాక శివారు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో మంచినీళ్లు అనుకొని ఓ విద్యార్థిని హైడ్రోజన్ పెరాక్సైడ్ తాగి అస్వస్థతకు గురైంది. పదోతరగతి చదువుతున్న పల్లకొండ పూర్ణ ఉదయం స్నాక్స్ టైంలో బిస్కెట్ తిన్నది. గొంతులో తట్టుకున్నట్లు కావడంతో మినరల్ వాటర్ ప్లాంట్ సమీపంలో ఉన్న ఓ బాటిల్‌లోని నీళ్లు తాగింది. కానీ ఆ బాటిల్‌లో మంచినీళ్లకు బదులు హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉండడంతో పూర్ణ గొంతులో మంటగా అనిపించి ఊమ్మేసింది. గట్టిగా అరిచింది. గమనించిన సిబ్బంది, ఉపాధ్యాయులు పూర్ణని చికిత్స నిమిత్తం పరకాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స అనంతరం పూర్ణను ఆమె బంధువుల ఇంటికి తరలించారు. ప్రస్తుతం పూర్ణ ఆరోగ్యం మెరుగ్గా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా.. పూర్ణ రెండు నెలల క్రితం విద్యార్థుల మధ్య గొడవలతో తన వద్ద ఉన్న నెయిల్ పాలిష్ తాగింది. ఇంత జరుగుతున్నా.. అక్కడి స్పెషల్ ఆఫీసర్ పట్టించుకోవట్లేదనే విమర్శలొస్తున్నాయి. 'నేను ఆ ఘటనలు జరిగిన సమయంలో అందుబాటులో లేను' అని సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీలో ఏం జరుగుతుందో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.